నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, శనివారం 2 మార్చి 2024 | NIZAMABAD




## గోదావరికి జలకళ

మహారాష్ట్రలోని గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు నుంచి శుక్రవారం ఉదయం 0.6 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. దీంతో రెంజల్ మండలంలోని కందకుర్తి వద్ద గోదావరి నదిలోకి నీరు వచ్చి చేరుతోంది.

–రెంజల్, మార్చి 1



మెట్లబావి గురించి గ్రామస్తులతో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

# దుష్ప్రచారం సిగ్గుచేటు

**కేసీఆర్ చేసిన మంచిపనులు కనిపించకూడదనేదే రేవంత్ ఉద్దేశం**

**కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు అన్యాయం చేస్తున్నది**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల**



మేడిగడ్డ బరాజ్‌ను చూపిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, మార్చి 1 : మేడిగడ్డ బరాజ్‌కు చెందిన కేవలం మూడు పిల్లర్లు స్వల్పంగా కుంగిపోతే ఏకంగా కాళేశ్వరం ప్రాజెక్టే కొట్టుకుపోయినట్లు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కుట్రపూరితంగా ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. చలో మేడిగడ్డలో భాగంగా ఆయన బరాజ్‌పై మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. పిల్లర్లకు మరమ్మతులు నిర్వహిస్తూనే సాగునీటిని అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం కావాలనే కేసీఆర్ చేసిన మంచి పనులను కనుమరుగు చేసేందుకు కుట్రలకు పాల్పడుతున్నదని విమర్శించారు. కేసీఆర్ చేసిన పనులకు సంబంధించి ఆనవాళ్లు లేకుండా చేస్తామని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. సుమారు రూ. 80వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ నిర్మాణానికి అయిన ఖర్చు రూ. 3వేల 500కోట్లు ఉంటుందని.. ఇందులో మూడు పిల్లర్ల మరమ్మతులకు సుమారు రూ. 3–4 వందల కోట్లు కావచ్చన్నారు. మిగతా పిల్లర్లు, డ్యామ్, వంతెన దృఢంగా ఉన్నాయని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా నిర్మించిన కాళేశ్వరం పూర్తిగా వేస్ట్ అంటూ అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం, మంత్రులే ఇలాంటి దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అంటే రాష్ట్ర ప్రజలకు తండ్రిలా ఉండాలి తప్ప ఇలా చేయకూడదన్నారు.

# 'కాళేశ్వరం'పై కాంగ్రెస్ కుట్ర

### ప్రాజెక్టు కొట్టుకుపోయినట్టు ప్రచారం

**కాళేశ్వరం ప్రాజెక్టుపై** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులోభాగంగా పార్టీ ఆధ్వర్యంలో 'చలో మేడిగడ్డ' కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేయగా.. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్ తదితరులు తరలివెళ్లారు. బరాజ్‌ను అణువణువు పరిశీలించి వాస్తవాలను ప్రజలు, మీడియాకు వివరించారు.



బరాజ్‌ను పరిశీలిస్తున్న కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు

# చిన్న సమస్యను భూతద్దంలో పెట్టిచూపిస్తున్నారు..

### మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, మార్చి 1: మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దగా చూపిస్తున్నారని మాజీ సభాపతి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి శుక్రవారం మేడిగడ్డ బరాజ్ పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ..ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని పేర్కొన్నారు. కానీ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఏదో అయిపోయినట్టు, లేనిది ఉన్నట్లు చూపిస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ బరాజ్ 86 పిల్లర్లలో మూడు పిల్లర్లు కుంగాయని తెలిపారు. అవి ఎందుకు కుంగాయి, అందు లో ఏదైనా సాంకేతిక సమస్య ఉండవచ్చని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా జరగనట్లు ఒక్క మేడిగడ్డలో జరిగినట్లు భూతద్దంలో పెట్టి చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టులో నీరు ఎక్కువగా ఉన్నచోట ఉన్న 83 పిల్లర్లు బాగున్నాయని, అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుబంధంగా అనేక బరాజ్‌లు, రిజర్వాయర్లు, 1530 కిలోమీటర్ల మేర కాలువలు, 270 కిలోమీటర్ల సొరంగం తవ్వి, లిఫ్టులు కట్టినట్లు తెలిపారు. సముద్రమట్టం కన్నా సుమారు 600 మీటర్లలోతు నుంచి నీటిని తోడి ఎడారిగా మారుతున్న తెలంగాణను సస్యశ్యామలం, సుభిక్షం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దీనిని కొందరు జీర్ణించుకోవడంలేదన్నారు.ప్రభుత్వానికి రైతులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల పనులను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. పోచారం వెంట డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఉన్నారు.



కేటీఆర్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మాజీ సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి

# మరమ్మతులు చేపట్టండి..

### ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



పిల్లర్‌ను పరిశీలిస్తున్న జాజాల

ఎల్లారెడ్డి, మార్చి 1: మేడిగడ్డ బరాజ్ లోని 20వ పిల్లర్ కుంగిన మాట వాస్తవమేనని, వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టును పరిశీలించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి మరమ్మతులు చేపడుతామని ప్రకటించిందన్నారు. ఇది తమ మొదటి విజయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అంటూ మాట్లాడడం సరికాదన్నారు. ఇప్పటికీ ప్రాజెక్టు నుంచి ఐదు వేల క్యూసెక్కుల సాగునీరు రైతులకు అందుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలని సూచించారు. బరాజ్ వద్ద వెంటనే మరమ్మతులు ప్రారంభిస్తే రైతులకు మేలు చేసిన వారవుతారని అన్నారు.

# ప్రాచీన కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత

### రాజంపేట్‌లోని మెట్లబావిని పరిశీలించిన కామారెడ్డి కలెక్టర్

రాజంపేట్, మార్చి 1: ప్రాచీన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. రాజంపేట మండలకేంద్రంలోని మెట్ల బావిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన మెట్లబావిని దాతల సహకారంతో బాగు చేయిస్తామన్నారు. పూడిక తీసేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు




కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

నిజాంసాగర్, మార్చి1: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు.మహ్మద్‌నగర్ మండల మండల కేంద్రంలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై 234 మందికి కల్యాణలక్ష్మి, 95 మందికి షాదీముబారక్ చెక్కులను అందజేసిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా త్వరలో మహిళలకు రూ.2,500, రైతులకు రుణమాఫీని అమలుచేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని అన్నారు. తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు నియోజకవర్గంలో 500 బోరుబావులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**నాగమడుగు మత్తడి పనుల పరిశీలన**

నిజాంసాగర్ మండలం జక్కాపూర్–వడ్డెపల్లి–కొమలంచ గ్రామ శివారు ప్రాంతంలో నాగమడుగు మత్తడి నిర్మాణ పనులను ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పరిశీలించారు. మత్తడి వివరాలను మ్యాప్ ద్వారా తెలుసుకొన్నారు.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు



అన్నారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్



మేడిగడ్డకు చేరుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, కౌశిక్ రెడ్డి, తదితరులు

# కేసీఆర్‌పై కోపంతో.. రైతులపై పగబట్టకండి


### కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రలో బీఆర్ఎస్ నేతలు కడియం, కేటీఆర్, హరీశ్

- **మేడిగడ్డకు మరమ్మతులు చేయించి.. నీళ్లను లిఫ్ట్ చేయండి**
- **3 పిల్లర్లకు సమస్య వస్తే.. కాళేశ్వరం మొత్తం నష్టపోయిందని బద్నాం చేస్తున్నరు**
- **రైతులకు కామధేనువు లాంటిది కాళేశ్వరం**

'కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు కామధేనువు. అటువంటి కాళేశ్వరాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయండి. నీళ్లను వెంటనే లిఫ్ట్ చేసి రైతులకు అందించండి. నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ నేతలమంతా మేడిగడ్డకు వచ్చాం. ప్రాజెక్టు రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నది. దాన్ని అడ్డుకుని ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే ఇక్కడికి వచ్చాం. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల పొడవైన టన్నెల్స్, 1500 కిలోమీటర్లకు పైగా ఉండే కాలువలు కలిగిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరంలో కేవలం మేడిగడ్డ బ్యారేజీలో 3 పిల్లర్లకు సమస్యలు వస్తే రాద్ధాంతం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారంపై వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేందుకు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం చేపట్టిన చలో కాళేశ్వరంలో భాగంగా ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపముంటే ఆ కోపాన్ని దయచేసి రైతులపై రాష్ట్రంపై చూపవద్దని వారు కోరారు. ఆలస్యం చేయకుండా మేడిగడ్డకు మరమ్మతులు చేయించి రైతులకు సకాలంలో నీళ్లు అందేలా చూడాలని చెప్పారు.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తదితరులు



మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ నామ నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, తదితరులు



ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, దేవిప్రసాద్, తదితరులు



మేడిగడ్డ వద్ద కేటీఆర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, తదితరులు